# పరమాణువే పరమాత్మ

**ప్రదోషే దీపక శ్చంద్రః ప్రభాతే దీపకో రవిః**
**త్రైలోక్యే దీపకో ధర్మః సుపుత్రః కులదీపకః.**

**సూర్యుడు పగటియందు ప్రకాశిస్తూ జీవులకు జగత్తును చూపుతాడు. చంద్రుడు రాత్రులందు ఉదయించి జీవులకు దారులు చూపుతాడు. ధర్మము త్రిలోకములనూ ప్రకాశింపజేయుచు సర్వజీవులకు ఆదర్శమును ప్రబోధిస్తుంది. సుపుత్రుడు ఆదర్శవంతమైన ప్రవర్తనతో కులదీపకుడుగా వెలుగొందుతాడు.**

ఎక్కడ చూచినా దైవము తప్ప అన్యములేదనే సత్యాన్ని దర్శించి, ప్రదర్శించి, ప్రకటించి, ప్రబోధించినవాడు కణాదుడు. "అణోరణీయాన్ మహతో మహీయాన్", ప్రతి అణువునందున్నది దైవమే అనే విషయాన్ని కనిపెట్టి, అణువే దైవమని చాటి చెప్పాడు. అణువు లేకుండా జగత్తు లేదు. సృష్టి ప్రారంభంలో భూమ్యాకాశములుగాని, సూర్యచంద్రులుగాని, నక్షత్రాలుగాని లేవు. సర్వత్రా కారుచీకటి క్రమ్ముకొన్నది. అలాంటి సమయంలో పరమాణువులన్నీ సమ్మిళితమై చాలా దట్టమైనరీతిగా కుదురుకొనిపోవటంచేత ఎక్కువ వేడి సంభవించింది. ఆ వేడిచేత బ్రహ్మాండమైన శబ్దము ఏర్పడి ఆ దట్టమైన పదార్థము ముక్కలైపోయింది. అది సర్వత్రా వ్యాపించి పోయింది. అదియే సృష్టికి మూలకారణమైనది. ఇదియే కణాదునికి కలిగిన అనుభవము. అది పగిలినప్పుడు ఏర్పడిన శబ్దమే ప్రణవము. అదియే ఓంకారము. అదియే ప్రణవనాదము. అదియే ప్రథమ నాదము. అది సర్వత్రా నిండియున్నది. ప్రణవము దేనినుండి ప్రారంభమైనది? పరమాణువునుండియే ప్రారంభమైనది. ఇట్టి ప్రణవ నాదమును ప్రతి మానవుడు స్మరించి తరించాలని బోధించాడు కణాదుడు.

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు
మేటి వస్తువునందున మేటియగుచు
అంతటను సర్వసాక్షియై యలరునట్టి
ప్రణవమే దైవము, దైవమే ప్రణవము

ప్రణవశబ్దము ప్రారంభమైన తర్వాత సూర్యచంద్రాదులు, భూమ్యాకాశాలు ఆవిర్భవించాయి. ఈ సృష్టికి మూలకారణం పరమాణువే. ప్రతి మానవుడు పరమాణువులయొక్క సమ్మిళితమైన స్వరూపమే. పరమాణువు లేని దేహముగాని, రూపముగాని ఎక్కడా కానరాదు. కనుక, మానవుడు మొట్టమొదట పరమాణుతత్త్వాన్ని గుర్తించడానికి ప్రయత్నించాలి.

**అణుతత్త్వముద్వారానే దైవత్వమును గుర్తించవచ్చు**

ఈనాటి మానవుడు మన ప్రాచీన ఋషులు ప్రవచించిన సత్యములను అర్థము చేసుకోలేక, వాటిని కట్టుకథలుగా భావించి అపహాస్యం చేస్తున్నాడు. ప్రాచీన సంస్కృతియొక్క పవిత్రతను గుర్తించుకునే శక్తిసామర్థ్యములను కోల్పోయి, తనయందే ఉన్న పరమసత్యమును తాను గుర్తించుకోలేకపోతున్నాడు.

మహనీయుల విగ్రహాలను ఊరియందు పలుచోట్ల ప్రతిష్ఠిస్తున్నాడేగాని, వారి ప్రబోధాలను ఏమాత్రం లక్ష్యం చేయడం లేదు. ఆ పవిత్రమైన స్వరూపాలను బాహ్యంగా ప్రతిష్ఠిస్తే సరిపోదు, వాటిని తన హృదయ పీఠముపైన భద్రము చేసుకోవాలి; వారి ప్రబోధాలను ఆచరణలో పెట్టాలి. కణాదుడు ఏ కాలమునాటివాడు? ఇరవైవేల సంవత్సరాలకు పూర్వం ఈ కణాదుని విషయం జగత్తులో ఎంతగానో వ్యాప్తమైనది. ఈనాటి సైంటిస్టులు గుర్తించిన ఆక్సీజను, హైడ్రోజనుల తత్త్వాన్ని కణాదుడు ఆనాడే గుర్తించాడు. కాని, ప్రజలు సైంటిస్టుల మాటలను విశ్వసిస్తూ, ప్రాచీన ఋషులు అనుభవించి, ఆనందించి, అందించిన సత్యవాక్యములను విస్మరిస్తున్నారు. దైవత్వమును అణువుద్వారానే గుర్తించవచ్చునని ప్రబోధించాడు కణాదుడు. అణువు కంటికి కనిపించదు. కాని, అది మనం తినే తిండిలో ఉన్నది; చూసే చూపులో ఉన్నది; మాట్లాడే మాటలో ఉన్నది; నడిచే నడకలో ఉన్నది. సర్వత్రా ఉన్నది అణువే. అణువుపైనే నడుస్తూ, అణువునే తింటూ, త్రాగుతూ, అణుతత్త్వాన్నే అనుభవిస్తూ దానిని విస్మరిస్తున్నాము. అణుపరిశోధన కేవలం సైంటిస్టులకు మాత్రమే సంబంధించినదని భావించి దానిని ప్రక్కకుపెడుతున్నాము. Atomic Process చాలా పవిత్రమైనది. దీనినుండియే దైవత్వమును గుర్తించుటకు వీలౌతుంది. కాని, మానవుడు దీనిని అలక్ష్యం చేసి భౌతికమైన, లౌకికమైన జీవితాన్ని గడుపుతున్నాడు.

**అశోకుడు తన మంత్రికి నేర్పిన గుణపాఠం**

ఒకానొక సమయంలో అశోకచక్రవర్తి తన మంత్రితో కలిసి వనవిహారం సల్పుచుండగా మార్గమధ్యంలో వారికొక బౌద్ధసన్యాసి ఎదు రయ్యాడు. వెంటనే అశోకుడు తన కిరీటమును తీసి ఆ మహనీయుని పాదములపై శిరస్సుపెట్టి నమస్కరించాడు. అది మంత్రికి ఏమాత్రం నచ్చలేదు. అశోకునివంటి మహోన్నత వ్యక్తి ఒక సాధారణ బౌద్ధసన్యాసి పాదములపై శిరస్సుపెట్టడం భావ్యం కాదని, ఈవిషయంలో అశోకుని ప్రవర్తన చక్రవర్తిస్థాయిని అవమానించే విధంగా ఉందని భావించాడు. మంత్రియొక్క మనోభావాలను గుర్తించిన అశోకుడు తగిన సమయం చూసి అతనికి గుణపాఠం నేర్పించాలని సంకల్పించుకున్నాడు. కొంతకాలం తరువాత ఒకనాడు ఆ మంత్రిని పిలిచి తనకు ఒక మేకతల, ఒక గొఱ్ఱెతల మరియు ఒక మనిషితల – ఈ మూడింటినీ తెచ్చిపెట్టవలసిందిగా కోరాడు. మంత్రి ఏదోవిధంగా మేకతలను, గొఱ్ఱెతలను సంపాదించి, తరువాత స్మశానానికి వెళ్ళి ఒక శవముయొక్క శిరస్సును ఖండించి రాజుగారివద్దకు తీసుకు వెళ్లాడు. "తెచ్చాను మహారాజా!" అన్నాడు. "వాటిని మార్కెట్‌కి తీసుకువెళ్ళి అమ్ముకొనిరా!" అన్నాడు అశోకుడు. మార్కెట్‌లో మేకతల, గొఱ్ఱెతల క్షణంలో అమ్ముడుపోయాయి. కాని, ఎంతసేపు కాచుకొని వున్నా మనిషి తలను కొనుక్కోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. మంత్రి తిరిగి వచ్చి ఈ సంగతిని విన్నవించగా అశోకుడు "పోనీ, ఎవరికైనా ఉచితంగా ఇచ్చేసిరా", అన్నాడు. కాని, ఎంత ప్రయత్నించినప్పటికీ మనిషితలను ఉచితంగా తీసుకోవడానికి కూడా ఎవరూ అంగీకరించలేదు. అప్పుడు అశోకుడు, "మంత్రీ! ఆనాడు నా శిరస్సును ఒక బౌద్ధసన్యాసి పాదములపై పెట్టినప్పుడు నీవెంతగానో బాధపడ్డావు. కాని, ఇప్పుడు నీవే చూశావు కదా! ప్రాణం పోయిన తరువాత ఈ శిరస్సుకు ఎవ్వరూ విలువ ఇవ్వరు. అందుకే నా శిరస్సును ఆ బౌద్ధసన్యాసి పాదములపైన పెట్టి నా జన్మను సార్థకం చేసుకున్నాను", అని చెప్పాడు.

**అణుతత్త్వమే ప్రాణతత్త్వము, ప్రణవతత్త్వము**

"ధనము వచ్చును, పోవును, ధరణియందు. సత్యధర్మాలు నిలుచును శాశ్వతముగ" అవియే మానవజన్మకు సార్థకతను చేకూర్చుతాయి. దేహంలో 'సోఽహం' తత్త్వమున్నంతవరకే అందరూ దేహాన్ని గౌరవిస్తారు. అదియే ప్రణవనాదము. అదియే అణుశక్తి. అణువుయొక్క శక్తి సామర్థ్యములు దైవమునుండి ఆవిర్భవించినవేగాని, ఒకరు సృష్టించినవి కావు. ఈ సత్యాన్ని కణాదుడు ఆనాడే ప్రపంచానికి చాటినాడు. ఆ దివ్యశక్తి దేహమును వదలిపోయిన

తరువాత ఎవ్వరూ దీనిని ఆశించరు. అణు స్వరూపమే దైవస్వరూపము. అణుస్వరూపమే జగత్స్వరూపము. అణు స్వరూపమే ఆకాశస్వరూపము. అణుస్వరూపమే శబ్దస్వరూపము. ఈ చరాచర జగత్తంతయు అణువులతోనే నిండియున్నది. కనుక, అణు తత్త్వమును అలక్ష్యం చేయకూడదు. అణుస్వరూపము చాలా ఘనమైనది. సైంటిస్టులు ఎంతోకాలమునుండి దీనిగురించి పరిశోధన చేస్తున్నారు. అణువు ఎక్కడినుండి ప్రారంభమైందో తిరిగి అక్కడికి వచ్చి చేరడానికి 22వేల కోట్ల సంవత్సరాలు పడుతుంది. ఇట్టి అణుతత్త్వాన్ని మానవుడు ఎందుకు గుర్తించుకోలేకపోతున్నాడు? భూమి తనచుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతున్నది. దీనిని ఎవరు త్రిప్పుతున్నారు? ఎందువలన తిరుగుతున్నది? ఈ సత్యాన్ని గుర్తించడానికి ఎవ్వరూ ప్రయత్నించడం లేదు. భూమి తనచుట్టూ తాను తిరగటంచేత రాత్రింబవళ్లు ఏర్పడుతున్నాయి; సూర్యునిచుట్టూ తిరగటంచేత ఋతువులు ఏర్పడి దేహమునకు కావలసిన ఆహారపదార్థములు లభ్యమౌతున్నాయి. కనుక, ఇది కారణంలేని సృష్టికాదు. దైవసంకల్పముచేతనే ఇదంతా జరుగుతున్నది. ఇది లోకక్షేమంకోసం దైవము ఏర్పరచిన నియమమే.

పవిత్రమైన అణుశక్తిని ఈనాటివరకు ఎవ్వరూ గుర్తించలేదు. అణువు కేవలం నిర్జీవమైనదని భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. ఈ జగత్తంతయు కలిపి ఏ ప్రాణశక్తి కలదో ఆ ప్రాణశక్తి అణువులోకూడా ఉన్నది. భగవంతుడు అణుస్వరూపుడు, ఘన స్వరూపుడుకూడా. కనుక, మానవుడు దైవసంకల్పమేమిటో, ఈ సృష్టియొక్క రహస్యమేమిటో, తనయొక్క కర్తవ్యమేమిటో గుర్తించి, వర్తించాలి. తాను ముఖ్యంగా గుర్తించవలసినది అణుతత్త్వమే. దానిని గుర్తిస్తే సర్వమును గుర్తించిన వాడౌతాడు. అణువే దైవము. అదియే ప్రాణతత్త్వము. పరమాణువులోనున్న ప్రాణతత్త్వమే ప్రపంచమంతటా సంచరిస్తున్నది. ఇదియే కణాదుడు చెప్పాడు. పరమాణువులు సర్వత్రా వ్యాపించియున్నాయి. పరమాణువుల నుండి వెలువడే ప్రణవ నాదముకూడా అణుమాత్రంగానే ఉన్నది. మన మానసిక తత్త్వముకూడా దీనిపైననే ఆధారపడి ఉన్నది.

**"ఇది నా దేహము కాదు, మీ దేహమే"**

భక్తులు ప్రార్థనలు చేస్తుంటారు. ఈ ప్రార్థనలవలన కలిగే ఫలిత మేమిటని కొందరు ప్రశ్నిస్తారు. నిజంగా ప్రార్థనలవల్ల ఎంతో మేలు జరుగుతున్నది. ప్రార్థనద్వారా ఎంతటి ఘనమైన విజయాన్నైనా సాధించవచ్చు; అసాధ్యముకూడా సుసాధ్యమవుతుంది. ఒక చిన్న విషయం. పది దినములనుండి నా చెక్కు పెద్దగా వాచింది. నేను ఏ మందూ తీసుకోను. నిన్నటిదినము నేను గమనించాను – వచ్చినవారందరి దృష్టి నా ముఖంపైన పోవటంలేదు, నా చెక్కుపైన పోతున్నది. "ఇంకా తగ్గలేదే, స్వామికి ఎంత బాధగా ఉందో ఏమో!" అని భక్తులు ఆందోళన చెందుతూవచ్చారు. సాయంకాలము Valedictory function (సేవాదళ్ సదస్సు ముగింపు సమావేశం)లో మాట్లాడిన తరువాత లోపలకు వెళ్ళాను. భక్తుల ప్రార్థనలన్నీ కుప్పలు కుప్పలుగా వచ్చాయి, "స్వామీ! రేపటి దినము గురుపూర్ణిమ. కనీసం రేపటికైనా మీరు నయం చేసుకోవాలి" అని. ఐతే, నయం కావాలని నేను సంకల్పించుకోలేదు. కాని, తెల్లవారి లేచేసరికి నొప్పి లేదు, బాధ లేదు. ఆ ప్రార్థనలయొక్క ఫలితమే ఈవిధమైన ఆనందాన్ని అందించింది. చాలామంది రాత్రి భోజనంకూడా చేయకుండా కంటిధారలతో ప్రార్థన చేస్తూవచ్చారు. ఒక్క నిమిషంలో నా మనస్సు వారిపై పడింది. నాకు నయం కావాలని నేను తలుచుకోలేదు, ఎప్పుడూ తలుచుకోను. ఎందుకంటే సంజయ్ సహాని తన ప్రసంగంలో చెప్పినట్లుగా, You and I are one. నేను, మీరు ఒక్కటే; ఇది నా దేహం కాదు, మీ దేహమే. మీ దేహాన్ని చూసుకోవడం మీ కర్తవ్యమే కదా! నా దేహాన్నిగురించి నేనెప్పుడూ పట్టించుకోను; ఇది నయం కావాలనిగాని, ఇది జరగాలనిగాని సంకల్పించుకోను. అట్టి స్వార్థము నాలో ఏనాడూ లేదు. నా కాలిగోటినుండి తలవెంట్రుకవరకూ స్వార్థమనేది నాలో కనిపించదు. కనుకనే, "మీరు నేను ఒక్కటే" అనడానికి నాకు ధైర్యమున్నది, అధికారమున్నది.

## విశాలభావమే సృష్టి; సంకుచితభావమే మరణం

ప్రతి మానవునియందున్న అణుశక్తి ఒక్కటే. ఈ శక్తిని మీరు అర్థం చేసుకోవాలి. మానవుడు ప్రాచీనకాలమునుండి విగ్రహారాధన చేస్తున్నాడు. రామవిగ్రహాన్ని పెట్టుకొని ప్రార్థిస్తున్నాడు, కృష్ణ విగ్రహాన్ని పెట్టుకొని పూజిస్తున్నాడు. ఈశ్వరుణ్ణి ఆరాధిస్తున్నాడు. కాని, 'ఆ రాముడు ఎక్కడున్నాడు? లేడే! ఆ కృష్ణుడు ఎక్కడున్నాడు? లేడే! ఆ ఈశ్వరుడు కనిపించటం లేదే!' అని కొందరు వాదించవచ్చు. రాముడు, కృష్ణుడు, ఈశ్వరుడు ... అన్ని రూపములూ ఉన్నాయి. కాని, సంకుచితమైన గుణములు గలవారికి సర్వమూ శూన్యంగానే కనిపిస్తుంది. విశాలభావమే సృష్టి. సంకుచిత భావమే మరణము. సంకుచిత భావములు వీడనంతవరకు మానవుడు చచ్చినవానితో సమానం. కనుక, మనం విశాలమైన భావములను పెంచుకోవాలి. మన హృదయాన్ని విశాలం గావించుకోవాలి. విశాలమైన హృదయంలోనే విశాలమైన దైవత్వము నిండియుంటుంది. ప్రాచీనకాలంలో మహర్షులు అనేకవిధములైన సాధనలు చేస్తూ వచ్చారు. కణాదుడుకూడా చాలా గొప్ప సాధన చేశాడు. తాను అణువునుండియే పుట్టానని, కట్టకడపటికి అణువునందే లీనము కావాలని గుర్తించాడు. దేహాభిమానమును పూర్తిగా త్యజించి, అణుతత్త్వమునుగురించి విచారణ చేస్తూ వచ్చాడు. కాని, ఈనాటి మానవుడు దేహాభిమానముతో, స్వార్థ స్వప్రయోజనములతో జీవితాన్ని గడుపుతున్నాడు. స్వార్థమున్నంత వరకూ దివ్యమైన అణుతత్త్వము ఏమాత్రము అర్థము కాదు. మీరు జపము, ధ్యానము, పూజలు ఇత్యాది సాధనలు చేసుకోవచ్చు, తప్పులేదు. కాని, అణుతత్త్వాన్ని మాత్రం మీరు మరువకూడదు. అణువునందే ఉన్నది సర్వము. మన దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ .... అంతా అణుమయమే. అణుతత్త్వమే దైవతత్త్వము.

భగవంతుడు మీ ప్రార్థనలను తప్పక వింటూ ఉంటాడు. కాని, ప్రార్థిస్తే భగవంతుణ్ణి కష్టపెట్టినట్లవుతుందని కొందరు భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటు. భగవంతునికి ఎప్పుడూ ఏ కష్టమూ లేదు. భక్తుల ఆనందమే భగవంతుని ఆనందము. మీ ఆనందానికి, నా ఆనందానికి భేదము ఏమాత్రం లేదు. కాని, మీ ఆనందము అల్పమైనవస్తువులచేత లభిస్తుంది. నా ఆనందము ఆత్మతత్త్వమునుండి ఆవిర్భవిస్తుంది. మీరు ప్రేమతో ఇచ్చేది అణుమాత్రమైనా అది నాకు ఘనమైనదిగానే ఉంటుంది. కాని, మీకు ఘనమైనది లభించినా మీకంత తృప్తిగా ఉండదు.

## భగవంతుణ్ణి పరిపూర్ణంగా ప్రేమించడమే భక్తి

నిజంగా గురుపూర్ణిమ అంటే ఏమి అర్థము? మనకు దివ్యమైన మార్గమును చూపేవాడు గురువు. పూర్ణిమ అనగా పవిత్రమైన చంద్రుని యొక్క ప్రకాశము. ఇది పరిపూర్ణమైన మనస్సుయొక్క తత్త్వానికి ప్రతీక. పరిపూర్ణమైన మనస్తత్త్వము ఎట్టి మచ్చలూ లేనిది. మనస్సులో ఏవిధమైన మచ్చలుండినా అది అంధకారముతో కూడియుంటుంది; ఆనందము నివ్వజాలదు. మీ మానసికతత్త్వాన్ని ప్రేమతత్త్వముతో ప్రకాశింప జేసుకోండి. కేవలం గ్రంథములను చదివినంతమాత్రాన మీ మనస్సు యందున్న దుర్గంధము తొలగిపోదు. మీరు చదివిన చదువులు అణుమాత్రమైనవి. కాని, అవి ఘనమైనవిగా మీరు భావిస్తున్నారు. చదువులచేతగాని, పదవులచేతగాని, అధికారముచేతగాని మీరు భగవంతుణ్ణి పొందజాలరు. భగవంతుడు ప్రేమయందు మాత్రమే కనిపిస్తాడు. భగవంతుణ్ణి పరిపూర్ణంగా ప్రేమించడమే భక్తి.

## మీ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించండి

ఈ గురుపూర్ణిమనాడు మీరు తెలుసుకోవలసినది ఏమిటి? మీ ముందు, వెనుక, క్రింద, పైన, సర్వత్రా ఉన్నది భగవంతుడే అని తెలుసుకోండి. God is in you, with you, around you. భగవంతుడు

మీయందున్నాడు, మీవెలుపలా ఉన్నాడు. అసలు మీరే భగవత్ స్వరూపులు. మొట్టమొదట ఈ సత్యాన్ని మీరు గుర్తించండి. పిచ్చిపిచ్చి కోరికలను విడనాడి మీ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించండి. Do your duty sincerely. అదే నిజమైన సాధన. మీరు ఆఫీసులో పనిచేసేటప్పుడు ఆఫీసుకు సంబంధించిన విషయాలపైనే దృష్టిపెట్టాలి. ఆఫీసులో కూర్చొని ఇంటివిషయాలను ఆలోచించకూడదు. అదేరీతిగా, ఇంట్లో ఆఫీసు విషయాలను ప్రవేశపెట్టకూడదు. ఇంటికి వచ్చిన తరువాత మీ భార్యా బిడ్డల సుఖాన్ని మీరు చూసుకోవాలి. ఈనాడు చాలామంది ఆఫీసులో పని పూర్తిచేయలేక ఆఫీసు పేపర్లను ఇంటికి తీసికొనివచ్చి చాలా అవస్థ పడుతుంటారు. ఆఫీసు పని ఆఫీసుకే, ఇంటిపని ఇంటికే, బిజినెస్ పని బిజినెస్‌కే, ఆధ్యాత్మికానికి సంబంధించిన పని ఆధ్యాత్మికానికే పరిమితం కావాలి. కాని, మీరు ఒకదానిలో మరొకటి ప్రవేశపెట్టి బాధలకు గురి అవుతున్నారు.

హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు ఎంతో గొప్ప శక్తిమంతులు, గొప్ప సైంటిస్టులు. ఈనాటి సైంటిస్టులు చంద్రమండలమునకు వెళ్ళగల్గారు. హిరణ్యకశిపుడు సూర్యమండలానికికూడా వెళ్లాడు. అంతేకాదు, నక్షత్ర మండలమునుకూడా చేరాడు. అతడు ధ్రువనక్షత్రాన్ని తాకేటప్పటికి పెద్ద ప్రమాదం సంభవించింది. కనుక, ఎంతటి గొప్ప సైంటిస్టు అయినప్పటికీ ఏది ఎంతవరకు చేయాలో అంతవరకే చేయాలి. మితిమీరిపోతే ప్రమాదం సంభవిస్తుంది.

**ఆత్మహత్య మహాపాపం**

మనిషికి మరణం ఉందికాని, మనస్సుకు మరణం లేదు. మనిషి మరణించినా జీవితములో తాను చేసిన పనులన్నీ మనస్సుపైన ప్రింటై ఉంటాయి. ఈరీతిగా, ఎన్నో జన్మల సంస్కారము మనస్సుపైన ప్రింటై ఉంటుంది. మనస్సుయొక్క తత్త్వము ఇట్టిది, అట్టిది అని చెప్పటానికి వీలుకాదు. కొంతమంది బాధలను భరించుకోలేక తమ ప్రాణాలు తీసుకుంటారు. "మనస్సుంటేనే కదా ఈ బాధలు! కాబట్టి, మనస్సును మరణింపచేస్తాము", అని భావించి ఆత్మహత్యకు పాల్పడతారు. ఇది మహాపాపము. మనస్సు అంత సులభంగా చావదు. కనుక, ఆత్మహత్య అనే సంకల్పమే మానవునికి రాకూడదు. ఎలాంటి కష్టాన్నైనా భరించుకొని జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి కృషి చేయాలి. ఆత్మయే దైవము, దైవమే ఆత్మ. "ఇందుగలడందు లేడని సందేహము వలదు" అన్నాడు ప్రహ్లాదుడు. భగవంతుడు సర్వత్రా ఉన్నాడు.

చావుపుట్టుకలేనట్టి శాశ్వతుండు
ఆదిమధ్యాంతరహితుడనాదివాడు
తాను చావక పుట్టక చంపబడక
సర్వము తానై వెలసి యుండు

దైవత్వానికి జననమరణాలు లేవు. ప్రతి మానవుడు "నేను దైవాన్ని, కేవలం దేహానికి చావు,పుట్టుకలు ఉన్నవికాని, నాకు లేవు", అనే ధైర్యముతో, విశ్వాసముతో జీవించాలి. దేహమున్నంతవరకు తన ప్రేమతత్త్వాన్ని దైవానికే అర్పితం చేయాలి.

**ఈనాడు చాలామందికి ధనమే దైవము!**

ఒక పర్యాయం శిరిడీలో బాబావద్దకు ఒక శ్రీమంతుడు వచ్చాడు. అతని జేబునిండా కరెన్సీ నోట్లున్నాయి. బాబా అతనిని పరీక్షించ దలచి, ఎప్పుడూ తనదగ్గరే ఉండే శ్యామ్ అనే వ్యక్తితో "శ్యామ్! నాకు అత్యవసరంగా ఐదు రూపాయలు కావాలి. నీవు ఊర్లోకి పోయి పటేల్‌ని అడిగి తీసికొనిరా", అని చెప్పాడు. శ్యామ్ కొద్దిసేపటికి తిరిగివచ్చి పటేల్ ఇంట్లో లేడని చెప్పాడు. బాబా అతనిని ఇంకొకరివద్దకు పంపించాడు. జేబునిండా నోట్లు

పెట్టుకున్న ఆ శ్రీమంతుడు అక్కడే ఉన్నాడు. కాని, అతను మహాలోభి. బాబా ఐదు రూపాయలు కావాలని అడుగుతుంటే "స్వామీ! తీసుకోండి" అని తన జేబులోనుండి తీసివ్వవచ్చు కదా! కాని, అతనిలో త్యాగభావమే లేదు. అప్పుడు బాబా మొట్టమొదట లోభత్వాన్ని విడనాడమని అతనికి బుద్ధిచెప్పారు. చాలామందికి ధనమే దైవము, రాజకీయమే దైవము, పార్టీలే దైవము. చచ్చిన తరువాత ఇవేమైనా వెంటవస్తాయా? ఎందుకు బ్రతుకుతున్నారు? ఏమి సాధిస్తున్నారు? మీరు మానవజన్మ ఎత్తినది మాలిన్యముతో జీవితాన్ని గడపటానికా? ఛీ, ఛీ! ఈవిధంగా జీవితాన్ని వ్యర్థం చేసుకోవద్దు. చేతనైనంతవరకు పరోపకారం చేయండి. ఈనాడు ప్రపంచంలోని మాలిన్యానికి కారణం ఏమిటి? రాజకీయములే! చిన్నపిల్లవాని మనస్సుకూడా మాలిన్యమైపోతున్నది. భార్యాభర్తలమధ్యకూడా జగడాలు బయలు దేరుతున్నాయి. ఎక్కడ చూసినా మాలిన్యము వ్యాపించిపోయింది. స్వాతంత్ర్యము రాక పూర్వం ఇన్ని బాధలుండేవి కావు. ఆనాడు తెల్లవారు నల్లవారిని బాధిస్తూవచ్చారు. కాని, ఈనాడు నల్లవారే నల్లవారిని బాధిస్తున్నారు. ఇదా మనం ఆశించవలసింది? కాదు, కాదు. పవిత్రమైన భావములు మనలో ఆవిర్భవించాలి. దుర్భావాలకు మన హృదయంలో చోటిస్తే దుర్మార్గులమైపోతాము.

**కష్టాలు కదిలిపోయే మేఘాలు**

ప్రేమస్వరూపులారా! ప్రేమను పెంచుకోండి. ప్రేమచేతనే బ్రతకండి. ప్రేమచేతనే మీ జీవితాన్ని అంత్యము గావించుకోండి. అదియే నిజమైన జీవితము. ఉపనిషత్తులు మానవ జీవితమునకు ఉత్తమమైన విలువ నిచ్చాయి. మానవుడు గౌరవింపదగినవాడు, ప్రేమించవలసినవాడు. తాను కష్టసుఖాలను విశాలమైన హృదయంతో స్వాగతం చేయాలి. చైనాలో ఒక సూక్తి వాడుకలో ఉంది: "కష్టాలే మన స్నేహితులు. వాటికి స్వాగతం పలుకుదాం." కష్టములోనున్న సుఖము మరొకదానిలో చిక్కదు. కనుకనే, "న సుఖాల్లభ్యతే సుఖం" అన్నారు. చాలామంది "స్వామీ! నాకు దుఃఖంగా ఉంది, కష్టంగాఉంది" అని చెప్తుంటారు. అది వింటే నాకు నవ్వొస్తుంది. "ఆ బాధలు, ఆ కష్టములు నాకు రాకూడదా!" అని నేననుకుంటాను. కాని, అవి నాదగ్గరికే రావు. కష్టాలకు క్రుంగిపోవడం మంచిది కాదని నేను భక్తులకు చెబుతుంటాను. బాధలకు, దుఃఖమునకు నేనేమాత్రం అవకాశమివ్వను. ఈ దేహానికి త్వరలో 77వ సం॥ రాబోతున్నది. ఇంతవరకు నేను ఒక్క క్షణమైనా దుఃఖపడినది లేదు. మానవుడు ఆనందమయుడు, ఆనందపిపాసి. ఆనందమే అతని ఆస్తి. ఆనందము తన హృదయమునందే ఉండగా దుఃఖించడమెందుకు? తన నిజ తత్త్వాన్ని అర్థం చేసుకోలేకపోవటంచేతనే దుఃఖపడుతున్నాడు.

ప్రేమస్వరూపులారా! ప్రాపంచిక సంబంధమైనవి వస్తుంటాయి, పోతుంటాయి. కాని, వచ్చి పోనటువంటిది ప్రేమతత్త్వమొక్కటే. కనుక, సాధ్యమైనంతవరకూ ప్రాపంచిక వ్యవహారాలను తగ్గించు కోవడానికి ప్రయత్నం చేయండి. మీరూ సుఖంగా ఉండండి, తోటివారినీ సుఖపెట్టండి. కష్టములెదురైతే అధైర్యపడకండి. అవి కేవలం కదిలిపోయే మేఘాలని గుర్తించండి. విశాలమైన ఆకాశము మేఘాలు లేకుండా ఉంటుందా? మన హృదయమే ఒక ఆకాశము. ఇందులో 'అటాచ్‌మెంట్స్' అనే మేఘాలు వచ్చినప్పుడు మనకంతా చీకటిగా కనిపిస్తుంది. ఈ వచ్చిపోయే మేఘాలను చూసి ఏమాత్రం worry కాకూడదు. What is the shape of worry? It is mentally created fear. ప్రతి మానవునికి కష్టనష్టములు సంభవిస్తూనే ఉంటాయి. వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి.

ప్రేమస్వరూపులారా! అశోకుడు తన మంత్రికి బోధించిన విషయాన్ని మీరు గుర్తుంచుకోండి. ప్రాణమున్నంతవరకే దేహానికి గౌరవముంటుంది. ప్రాణం పోతూనే దీనికి ఏమాత్రం విలువలేదు.

దుర్యోధనుడుకూడా తన అంతిమక్షణాల్లో ఇదే విషయాన్ని చెప్పాడు: “ప్రాణమున్నంతవరకు నన్ను అందరూ గౌరవించారు. రేపటిదినము నేను దేహాన్ని వదలిపెడుతూనే దీనిపై కుక్కలు, కాకులు కూర్చుని పీక్కుతింటాయి.” జరగవలసిందేదో జరుగుతుంది. ప్రాణమున్నంత వరకూ గౌరవాన్ని నిలుపుకోవాలి. దివ్యమైన భావములను పెంచు కోవాలి. అప్పుడే మీరు దివ్యమైన జీవితాన్ని అనుభవించిన వారౌతారు. ఈనాడు మీరు కేవలం లౌకికమైన జీవితాన్ని అనుభవిస్తున్నారు. లౌకికమైన జీవితము అవసరమే. ఐతే, లౌకికమైన జీవితములోనే అలౌకికమైన ఆత్మతత్త్వమున్నదని గుర్తించుకోండి. ఈ గురుపూర్ణిమనుండియైనా మీ హృదయాన్ని పరిశుద్ధంగా పెట్టుకోండి. మనము ఎక్కడైనా కూర్చున్నప్పుడు ఒక్కొక్కసారి దోమలు వచ్చి కుడుతుంటాయి. వాటిని మనం కొట్టేస్తాము కదా! అదేరీతిగా, మనలను బాధించే కష్టాలను, నష్టాలను నెట్టేయాలి. దుఃఖానికి క్రుంగకుండా, సుఖానికి పొంగకుండా, సమచిత్తముతో మనము దివ్యత్వాన్ని పొందటానికి ప్రయత్నం చేయాలి.

(శ్రీవారు “వహె గురు వహె గురు వహె గురుజీ బోలో...” అనే పాటను పాడిన తరువాత తమ దివ్యోపన్యాసాన్ని కొనసాగిస్తూ ఇలా అన్నారు)

**“నేనే బ్రహ్మను” అని భావించండి**

గురువు ఒక్కడే! అంతర్గురువు, బహిర్గురువు అని ఇద్దరు లేరు. మీ హృదయమునుండి సత్యవాక్కును ప్రబోధించేవాడే గురువు.

*గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః*
*గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః*

కాబట్టి నీవే బ్రహ్మ, నీవే విష్ణువు, నీవే శివుడు, నీవే గురువు. సర్వమూ నీవే. నీ గురిని “సోऽహం” (నేనే దైవం) అనే తత్త్వముపై నిశ్చలంగా పెట్టుకో. విద్యార్థులకుగాని, గృహస్థులకుగాని, వానప్రస్థులకుగాని, సన్యాసులకు గాని అదొక్కటే ముఖ్యమైనది. అందరికీ లక్ష్యము అదొక్కటే. మీలోపలనున్న “సోऽహం”ను మీరు స్మరిస్తూ రండి! “అహం బ్రహ్మాస్మి”, “నేనే బ్రహ్మను” అని భావించండి. తప్పేమీ లేదు. ఇది అహంకారమనుకుంటారేమో! చాలా పొరపాటు. ఇది అహంకారమేమీ కాదు. నిజంగా మీరందరూ దైవ స్వరూపులే. “నేను దైవస్వరూపుడను” అని విశ్వసించి, దైవముగా రూపొందండి. ఆవిధంగా విశ్వసించినప్పుడు మీలో దుర్గుణములు ఉండకూడదు, ఎట్టి మాలిన్యమూ చేరకూడదు. ఎందుకంటే, దైవములో దుర్గుణములుగాని, మాలిన్యముగాని ఉండవు. కనుక, మీరు నిర్మలమైన, నిశ్చలమైన, నిస్స్వార్థమైన భావాలను పోషించుకోండి. మంచి పనులే చేయండి. మంచి మాటలే చెప్పండి. మంచి దృష్టినే పెట్టుకోండి. ఆదర్శవంతమైన జీవితాన్ని గడపండి.

మీలో పవిత్రమైన భావాలు లేకపోతే మీరెన్ని పూజలు చేసినా ప్రయోజనము లేదు. మీరెన్నో సంవత్సరములనుండి ఇక్కడికి వస్తున్నారు, పూజలు చేస్తున్నారు. కాని, మీలో ఏమైనా మార్పు వచ్చిందా? వస్తున్నారు, పోతున్నారు... అంతే! ఇంక, ఇక్కడికి వచ్చి ప్రయోజనమేమిటి? రానక్కరలేదు. ఎక్కడున్నా మీరు చేయవలసిన సాధన చేసుకోండి, చాలు. ఇక్కడికి వస్తే మంచి భావాలను మీవెంట తీసుకువెళ్ళండి. పవిత్రమైన భావాలను పెంచుకోండి. మీ మానవత్వాన్ని దైవత్వంగా మార్చుకోండి. “అహం బ్రహ్మాస్మి” అనే వేదవాక్కుయొక్క సత్యాన్ని నిలబెట్టండి. ప్రాకృతమైన విషయాలపట్ల భ్రాంతిని వీడండి. మరణించిన తరువాత ఏదీ మీవెంట రాదు. పోయే సమయములో పిడికెడు మట్టికూడా తీసికొనిపోవడానికి వీలుకాదు. మీ సద్గుణములే మీవెంట వస్తాయి. కనుక, మీ తల్లిదండ్రులను, పెద్దలను, గురువులను గౌరవించండి. “మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో

భవ" అందరినీ దైవస్వరూపులుగా భావించండి. దైవత్వము సర్వత్రా ఉన్నదని విశ్వసించండి. ఇంతకంటే గొప్ప సాధన మరొకటి లేదు. మీరీవిధమైన జీవితాన్ని గడిపినప్పుడు దేశముకూడా సౌభాగ్యవంతముగా అభివృద్ధి అవుతుంది. మొట్టమొదట మీ హృదయాన్ని దైవభావముతో నింపుకోవాలి. ఇదే ఈనాడు మీరు నేర్చుకోవలసినది.